www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 14 నవంబరు 2022
5
పశ్చిమ గోదావరి



'ఆయుష్మాన్ భారత్'కు ఇకెవైసి పూర్తి చేయాలి
కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

ఆయుష్మాన్ భారత్ పథకానికి సంబంధించి ఇకెవైసి త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. ఆయుష్మాన్ భారత్ పథకాన్ని జాతీయ ఆరోగ్య రక్షణ పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని, ఈ పథకంలో జాతీయ బీమా కింద లబ్ధి పొందేందుకు అవకాశం ఉందని కలెక్టర్ పి.ప్రశాంతి ఒక ప్రకటనలో తెలిపారు. ఆయుష్మాన్ భారత్ కార్డులు ఇతర రాష్ట్రాల్లో కూడా వైద్యం చేయించుకోవడానికి ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఆయుష్మాన్ భారత్ పథకానికి సంబంధించి ఇప్పటి వరకు జిల్లాలో 7,42,629 మంది లబ్ధిదారులు ఉండగా అందులో ఇప్పటి వరకు 2,47,162 మందికి మాత్రమే ఇకెవైసి పూర్తి చేశారని, ఇంకా చేయించాల్సింది 4,95,467 మంది ఉన్నారని, వీరికి త్వరితగతిన ఇకెవైసి పూర్తి చేసేందుకు ఎంపిడిఓలు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

రొయ్య ధర పతనం

వంద కౌంటు వనామి రొయ్య ధర కిలో రూ.180
విదేశాలకు ఎగుమతులు నిలిచిపోవడమే కారణమంటున్న వ్యాపారులు
14న ఉండిలో ఆక్వా రైతుల సమస్యలపై నిరసన



ప్రజాశక్తి - కాళ్ల

ప్రస్తుతం ఆక్వా రైతులు తీవ్ర గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. విదేశాలకు ఎగుమతులు నిలిచిపోవడంతో వ్యాపారులు కొనుగోళ్లు బాగా తగ్గించడం వల్ల మార్కెట్లో రొయ్య ధర దారుణంగా పతనమైంది. రెండు నెలల్లో వంద కౌంట్ వనామీ రొయ్యల ధర కిలో రూ.310 నుంచి రూ.180కు దిగజారింది. విదేశాల నుంచి ఆర్డర్లు లేక ప్రాసెసింగ్ ప్లాంట్లు, కోల్డ్ స్టోరేజీలు రొయ్యల నిల్వలతో నిండిపోయాయి. రొయ్యల సాగు ఖర్చు బాగా పెరిగిపోయింది. రూ.లక్షల నష్టాలతో రొయ్యల రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. జనవరి వరకు ఆగి ఫిబ్రవరి నుంచి పంటలన్ని సాగు చేయాలని ఆలోచనలో కొంతమంది రైతులున్నారు. ఉమ్మడి జిల్లాలో రొయ్యల సాగు విస్తీర్ణం 1.2 లక్షల ఎకరాల్లో సాగవుతోంది. వార్షిక ఉత్పత్తి నాలుగు లక్షల టన్నులు. వార్షిక ఆదాయం రూ.18 వేల కోట్లు. 24 శీతల గిడ్డంగులు ఉన్నాయి.

ఆక్వా మార్కెట్ కుదేలు

విదేశాలకు ఆర్డర్లు తగ్గడంతో అక్టోబర్ నుంచి ఆక్వా మార్కెట్ కుదేలైంది. వంద కౌంటు వనామీ రొయ్య ధర రూ.210కి, 20 కౌంటు రొయ్య ధర రూ.480కి పడిపోయింది. ఆక్వారైతులు గగ్గోలు పెట్టడంతో ప్రభుత్వం జోక్యం చేసుకుని వంద కౌంటుకు రూ.240 చెల్లించాలని వ్యాపారులను ఆదేశించింది. అయితే ఆ ధర చెల్లించడానికి వ్యాపారులు సుముఖత చూపడం లేదు. ఈక్వేడార్ దేశంలో రొయ్య దిగుబడులు బాగా వచ్చాయి. చైనా, అమెరికా మార్కెట్లకు ఈక్వేడార్ రొయ్యలు ఎగుమతి అవుతున్నాయి. దీంతో మన ప్రాంతం నుంచి ఎగుమతులు నిలిచిపోయాయి.

వెంటాడుతున్న వైరస్‌లు

మొన్నటి వరకు అధిక వర్షాలు, ప్రస్తుతం చలి వాతావరణం కారణంగా విబ్రియో, వైట్‌స్పాట్ వైరస్‌లు విజృంభించి రొయ్యల దిగుబడులు 50 శాతానికి పడిపోయాయి. వైట్‌స్పాట్ సమస్య కారణంగా దుబాయ్, సౌదీఅరేబియా, ఖతార్, ఒమన్ దేశాలు మన రొయ్యల కొనుగోళ్లు పూర్తిగా నిలిపివేశాయి. ఆర్థికమాంద్యం నేపథ్యంలో యూరోపియన్ దేశాలకు ఎగుమతులు భారీగా క్షీణించాయి. ఎగుమతులు పూర్తిగా బంద్ కావడంతో ఆ ప్రభావం రొయ్యల మార్కెట్టుపై పడింది. కోల్డ్ స్టోరేజీల నిండా రెండు నెలల క్రితం కొనుగోలు చేసిన రొయ్యలున్నాయి. దీంతో వ్యాపారులు కొనుగోళ్లు చాలావరకు ఆపేశారు.

పెరిగిన సాగు ఖర్చులు

గతంలో వంద కౌంటు కేజీ రొయ్యల సాగు ఖర్చు రూ150 నుంచిరూ 160 వరకు ఉండేది. మేత, మందులు,చెరువు లీజు, కూలీల వేతనాలు, కరెంటు బిల్లులు పెరగడంతో వంద కౌంటు కేజీ వనామీ రొయ్యల సాగు ఖర్చురూ 240కు చేరుకుంది. ప్రస్తుతం మార్కెట్లో వ్యాపారులు కొనుగోలు చేసిన వెంటనే చెల్లించాలంటే రైతుకు కేజీకి రూ 180 ఇస్తున్నారు. మూడు వారాలు ఆగితే రూ 190 చెల్లిస్తున్నారు. ఆక్వా రైతులు కేజీ రూ 50 నుంచి 60 రూపాయల వరకు నష్టపోతున్నారు. ఎకరాకు లక్షల్లో నష్టం వస్తుంది.ఐదారు నెలలు ఇదే పరిస్థితి ఉంటుందని ఆక్వా మార్కెట్ నిపుణులు అంటున్నారు. మరలా విదేశాలకు ఎగుమతులు ఆర్డర్లు భారీగా వస్తేనే ధరలు పెరుగుతాయని చెబుతున్నారు.

ప్రభుత్వ ప్రోత్సాహం అంతంత మాత్రమే

ప్రభుత్వానికి ఏటా కోట్లాది రూపాయల విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించి పెడుతున్న రంగం ఆక్వా. అయితే దీనికి ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రోత్సాహమూ లేకపోయినా మొదటి నుంచి రైతులే కష్టనష్టాలను ఎదుర్కొని సాగు చేస్తున్నారు. ఆక్వా రంగం అభివృద్ధికి ప్రభుత్వం నామమాత్రంగానే చర్యలు తీసుకుంటుంది. మూడేళ్లుగా రొయ్యల మేత ధరలు పెరుగుతున్న తీరుపై ఆక్వా రైతులు ఆందోళన చెందుతున్నారు. లక్ష్యానికి మించి ఉత్పత్తులు సాధిస్తూ రాష్ట్రాన్ని ఆర్థికంగా ముందుకు నడిపిస్తూ విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జిస్తున్నా నాయకులకు మాత్రం పట్టడం లేదు. వ్యాధుల తీవ్రత, నీటి కొరత, మౌలిక వసతుల లేమి, నూతన పరిజ్ఞానం అందుబాటులో లేక నష్టాలపాలవుతున్నారు.

14న ఉండిలో ఆక్వా రైతుల సమస్యలపై నిరసన

ఈ నెల 14న ఉండిలో ఆక్వా రైతుల సమస్యలపై నిరసన కార్యక్రమం జరగనుంది. టిడిపి ఆధ్వర్యాన ఉండి ఎంఎల్ఎ ఎమ్మెల్యే మంతెన రామరాజు నాయకత్వాన నిరసన చేపట్టనున్నారు. ఆక్వా ఫీడ్, సీడ్ చట్టాలను తీసుకొచ్చామని చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం వాటి నాణ్యత విషయంలో సరైన చర్యలు తీసుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రొయ్యల ధర తగ్గింది

నంబూరి త్రినాధమూర్తిరాజు, ఆక్వా రైతు, కలవపూడి



ఈ ఏడాది రొయ్యల సాగు అతలాకుతలమైంది. రొయ్యల ధర గణనీయంగా తగ్గుతూ వచ్చింది. ఎక్కువ దిగుబడి వచ్చిన సమయంలో ధర దారుణంగా పడిపోయింది. ప్రకృతి వైపరీత్యాలకు తోడు మేత ధరలు పెరిగిపోవడం రైతులను ఇబ్బంది పెడుతోంది. విదేశాలకు ఎగుమతులు నిలిచిపోవడంతో వ్యాపారులు కొనుగోళ్లు తగ్గించారు. దీంతో రొయ్యల ధర పడిపోయింది.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవకాశాలు మెండు
జిల్లా పరిశ్రమల శాఖ జిఎం ఏసుదాసు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్



ఉమ్మడిక పశ్చిమగోదావరి జిల్లాలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు కృషి చేస్తున్నామని పరిశ్రమల శాఖ జిఎం ఏసుదాసు అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న పారిశ్రామిక పథకాలపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తూ ఔత్సాహికులైన పారిశ్రామికవేత్తలను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. ఆయన ప్రజాశక్తి ముఖాముఖిలో ప్రత్యేకంగా కొన్ని విషయాలను పంచుకున్నారు.

ప్రశ్న : ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం పరిశ్రమలు ఎన్ని ఉన్నాయి?

ఈ ఏడాది మార్చి వరకూ 2610 సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు రూ.432.00 కోట్లతో స్థాపించబడ్డాయి. పరిశ్రమల శాఖ ద్వారా 39,320 మందికి ఉపాధి కల్పిస్తున్నాము. ఇందులో 31 భారీ పరిశ్రమలు రూ.2254.00 కోట్లతో స్థాపించబడ్డాయి. 11,268 మందికి ఉపాధి కల్పిస్తున్నాం.



ప్రశ్న : 2022-23 సంవత్సరంలో కొత్తగా స్థాపించబడిన పరిశ్రమలు ఎన్ని?

2003 సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు రూ.175.52 కోట్లతో స్థాపించబడి 8006 మందికి ఉపాధి కల్పిస్తున్నాము.

ప్రశ్న : ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం వివరాలు తెలపగలరు?

ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకంలో 2021-22 సంవత్సరానికి 82 యూనిట్లు లక్ష్యంకాగా, 339 దరఖాస్తులు వివిధ బ్యాంకులకు సిఫార్సు చేశాము. అందులో 128 యూనిట్లు మంజూరు కాగా 111 యూనిట్లు స్థాపించబడ్డాయి. రూ.413.42 లక్షల మార్జిన్ మనీ విడుదల చేయబడింది. 2022-23 సంవత్సరానికి 116 యూనిట్లు లక్ష్యం కాగా ఇప్పటివరకు 77 దరఖాస్తులు వివిధ బ్యాంకులకు పంపగా, అందులో 43 యూనిట్లు మంజూరయ్యాయి. అందులో 27 యూనిట్లు స్థాపించబడ్డాయి.

ప్రశ్న : సింగిల్ డెస్క్ ద్వారా వివిధ పరిశ్రమలకు అనుమతులిచ్చారా?

సింగిల్ డెస్క్ ద్వారా 2022-23 సంవత్సరానికి వివిధ పరిశ్రమలకు సంబంధించి 151 అనుమతుల కోసం సంబంధిత శాఖలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయగా అందులో 144 యూనిట్లకు అనుమతులు మంజూరయ్యాయి. అందులో మూడు దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. మిగిలిన దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక ప్రోత్సాహక పెట్టుబడి విధానం, పారిశ్రామిక అభివృద్ధి విధానం 2020-23 పాలసీ, పారిశ్రామిక అభివృద్ధి విధానం 2020-23లో ఇప్పటివరకూ వివిధ పరిశ్రమలు (139) దరఖాస్తు చేసిన 234 క్లెయిములకు రూ.10.28 కోట్లు రాయితీలు మంజూరయ్యాయి. వైఎస్ఆర్ జగనన్న బడుగు వికాసం 2020-23లో, షెడ్యూల్డ్ కులాలవారు దరఖాస్తు చేసిన 214 యూనిట్లలో ఇప్పటివరకూ 127 క్లెయిములకు రూ.7.39 కోట్ల రాయితీలు మంజూరు చేశాము. వైఎస్ఆర్ జగనన్న బడుగు వికాసం 2020-23లో షెడ్యూల్డ్ తెగల వారు దరఖాస్తు చేసిన 21 యూనిట్లకుగాను, ఇప్పటి వరకూ తొమ్మిది యూనిట్లకు రూ.0.50 కోట్ల రాయితీలు మంజూరు చేశాము.

ప్రశ్న : పారిశ్రామికవేత్తలకు కావాల్సిన లక్షణాలేంటి?

మంచి వ్యాపార లక్షణం, నిర్ణీత సమయంలో సరైన నిర్ణయం తీసుకోవడం, వేగంగా స్పందించడం ఉండాలి. దాంతోపాటుగా సహనం, ప్రణాళికా నైపుణ్యం, నాయకత్వ లక్షణాలు, కార్మికుల క్షేమం కోరుకోవడం, తనపై అందరికీ నమ్మకం కలిగేలా నడుచుకోవాలి.

ప్రశ్న : పరిశ్రమల స్థాపనలో స్థూల అంశాలేంటి?

ఉత్పత్తులు, సర్వీసులు ఎంపిక చేసుకోవడం, మార్కెట్ పరిస్థితులను సర్వే చేస్తుండడం ఉండాలి. ప్రాజెక్టు రిపోర్టు తయారు చేయాలి. పరిశ్రమల స్థాపనకు అనువైన స్థలాన్ని ఎంపిక చేసుకోవాలి. వివిధ ప్రభుత్వ శాఖల అనుమతుల కోసం దరఖాస్తులు చేసుకోవాలి. ఆర్థిక సహాయానికి దరఖాస్తు చేయాలి. పరిశ్రమకు అవసరమైన భవనాల నిర్మాణం, యంత్రాలను కొనుగోలు చేయాలి.

ఆక్వా రైతులకు అండగా ప్రభుత్వం
వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నర్సింహరాజు

ప్రజాశక్తి - కాళ్ల

సిఎం జగన్మోహన్‌రెడ్డి ఆక్వా రైతులకు అండగా నిలుస్తున్నారని వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహారాజు అన్నారు. పెదఅమిరంలోని వైసిపి కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కోవిడ్ సమయంలో రైతుల వద్ద తక్కువ ధరకు రొయ్యలు కొనుగోలు చేసి కోట్లాది రూపాయలు అడ్డంగా దోచుకున్న ఎగుమతిదారుడు, ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు అని ఆరోపించారు. అటువంటి వ్యక్తి ఇప్పుడు ఆక్వా రైతుల సమస్యల పరిష్కారానికి అంటూ ఆందోళన చేపడుతున్నామనడం హాస్యాస్పదమన్నారు. ప్రభుత్వం వంద కౌంట్ రొయ్య ధర కిలో రూ.210గా నిర్ణయిస్తే రామరాజు రూ.220కు కొనుగోలు చేసి చూపితే రైతులు నమ్ముతారని వ్యాఖ్యానించారు. దొడ్డిదారిన రైతులను మోసగించి కోట్లు సంపాదించిన ఎంఎల్ఎ రామరాజుకు ప్రభుత్వం గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. రెండు, మూడు రోజుల నుంచి టిడిపి, జనసేన కలిసి జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంపై బురద జల్లే కార్యక్రమాలు చేపట్టడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపిపిలు పెన్మెత్స శిరీషవిశ్వనాథరాజు, ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, జెడ్‌పిటిసిలు యండగండి శ్రీను, పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, సొసైటీ బ్యాంకు ఛైర్మన్లు వేగేశ్న జయరామకృష్ణంరాజు, పేరిచర్ల సూర్యనారాయణరాజు, పార్టీ మండల కన్వీనర్లు గణేశ్న రాంబాబు, పివిఆర్‌కె.ఆంజనేయరాజు, జి.ధనరాజు పాల్గొన్నారు.

నేడు నర్సాపురంలో జిల్లాస్థాయి 'స్పందన'

ప్రజాశక్తి - భీమవరం

ఈ నెల 14న జిల్లాస్థాయి స్పందన కార్యక్రమాన్ని నర్సాపురం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని డివిజనల్, మండల, మున్సిపల్ కార్యాలయాల్లో స్పందన కార్యక్రమం యధావిధిగా జరుగుతుందని పేర్కొన్నారు. జిల్లా ప్రజానీకం ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

రేపు ఇలియాస్ హోవ్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి - తణుకురూరల్

వేల్పూరు టైలర్స్ వర్కర్స్ సంఘం ఆధ్వర్యంలో సాలిపేటలో ఏర్పాటు చేసిన ఇలియాస్ హోవ్ విగ్రహాన్ని ఈ నెల 15న మంగళవారం ఉదయం 9 గంటలకు ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ ఆవిష్కరిస్తారని, అనంతరం శివాలయం వద్ద సభ జరుగుతుందని సంఘం గౌరవాధ్యక్షులు బళ్ల చినవీరభద్రరావు, అధ్యక్షులు మల్లేశ్వరపు నాగరాజు, కార్యదర్శి వాసా వెంకటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రపంచంలో కోట్లాది మందికి ఉపాధి చూపిన మార్గదర్శకుడు కుట్టుమిషన్ రూపకర్త ఇలియాస్ హోవ్ అని పేర్కొన్నారు. ఈ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు.



నినదిస్తున్న సిపిఎం నేతలు, ప్రజలు

రైల్వే అండర్ టన్నెల్ నిర్మించాలి
సిపిఎం ఆధ్వర్యాన ధర్నా, సంతకాల సేకరణ

ప్రజాశక్తి - ఆకివీడు

దుంపగడప రోడ్డులోని జవహర్‌నగర్ రైల్వేగేటు వద్ద అండర్ టన్నెల్ నిర్మించాలని సిపిఎం ఆధ్వర్యాన ఆదివారం సాయంత్రం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా పట్టణ కార్యదర్శి కె.తవిటినాయుడు మాట్లాడుతూ ప్రజలు రాకపోకలకు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. తక్షణం ప్రభుత్వం స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నేతలు పెంకి అప్పారావు, డోకల లక్ష్మి, సందక సూరిబాబు, ఎస్.ఉదయకుమారి, బొడ్డుపల్లి రాంబాబు, డి.రవితేజ, కవిటమ్మ తదితరులు పాల్గొన్నారు.



బీచ్‌లో సందర్శకుల సందడి

సందర్శకులతో పేరుపాలెం బీచ్ కిటకిట

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెం బీచ్ ఆదివారం సందర్శకులతో కిటకిటలాడింది. కార్తీక మాసం, ఆపై ఆదివారం కావడంతో పర్యాటకులు పెద్దసంఖ్యలో ప్రత్యేక, ద్విచక్ర వాహనాలపై బీచ్ కు తరలొచ్చారు. పలువురు సముద్ర స్నానాలు చేసి ఉల్లాసంగా గడిపారు. తీరాన ఉన్న ఆలయాలను దర్శించుకుని సరివే, కొబ్బరి తోటల్లో సహపంక్తి భోజనాలు చేసి సేదతీరారు..బీచ్‌లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డిఎస్‌పి వీరాంజనేయరెడ్డి పర్యవేక్షణలో సిఐ వాడపల్లి సురేష్‌బాబు ఆధ్వర్యంలో ఎస్‌ఐలు ఎం.వీరబాబు, ఎస్.ప్రియకుమార్, పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. అలాగే రెవెన్యూ, పంచాయతీ, వైద్యఆరోగ్య శాఖ, మత్స్యశాఖల సిబ్బంది బీచ్‌లో విధులు నిర్వర్తించారు.

వేగంగా వెళ్లొద్దంటే.. చావగొట్టారు..!



బయట పడేసిన బీరువాలో వస్తువులు

సమతానగర్ వాసులపై ఇద్దరు యువకుల దాష్టీకం
ముగ్గురికి గాయాలు
కానిస్టేబుల్‌ను సైతం తోసేసి యువకుల పరారీ

ప్రజాశక్తి - ఆకివీడు

అది చిన్న రోడ్డు.. రయ్యిమంటూ మోటారు సైకిల్ దూసుకుపోయింది. మళ్లీ ఆ మోటారు సైకిల్ తిరిగొస్తుండగా స్థానికుడు ఆపి చిన్న రోడ్డులో అంత స్పీడు తగదని, నెమ్మదిగా వెళ్లాలని చెప్పగా ఒక్కసారిగా ఇద్దరు యువకులు ఆ వ్యక్తిపై దాడి చేయడమే కాకుండా అతని ఇంట్లోకి దూసుకెళ్లి భార్యపైనా దౌర్జన్యానికి పాల్పడిన ఘటన సమతానగర్‌లో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సమతానగర్‌లోని సవరపు రాజు తన ఇంటి ముందు నిల్చొని ఉండగా ఇద్దరు యువకులు మోటార్ సైకిల్‌పై వేగంగా దూసుకెళ్లారు. వెంటనే రాజు వారిని ఆపి పది అడుగులు కూడా లేని రోడ్డుపై అంతా స్పీడు తగదని, స్పీడు తగ్గించండి అని సూచించాడు. దీనిపై ఆ ఇద్దరు యువకులు రాజును దూషించారు. దీన్ని రాజు ఖండించడంతో వెంటనే వారు రాజుపై దాడికి తెగబడ్డారు. స్థానికులు వారించే ప్రయత్నం చేయగా వారినీ బెదిరించి ఇంటి అద్దాలు పగుల గొట్టారు. ఆపై ఇంట్లోకి దూసుకెళ్లి రాజు భార్యపై దాడికి తెగబడ్డారు. ఇల్లు మొత్తం చెల్లాచెదురు చేశారు. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా ఒక కానిస్టేబుల్ అక్కడికి హుటాహుటీన చేరుకున్నాడు. అయితే ఆ ఇద్దరు యువకులు కానిస్టేబుల్‌ను పక్కకు తోసేసి పరారయ్యారని స్థానికులు చెబుతున్నారు. ఈ ఘటనలో గాయాల పాలైన ముగ్గురిని స్థానికులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రాజు తలకు తీవ్ర గాయమైంది. యువకులు ఇద్దరూ తెలగపాముల ముఠాకు చెందిన వారుగా భావిస్తున్నారు.

యువతి సజీవ దహనంపై వీడని మిస్టరీ..!

షార్ట్ సర్క్యూట్ అనుమానాలను కొట్టేస్తున్న గ్రామస్తులు
ముమ్మాటికీ హత్యే అంటున్న యువతి తల్లి తరపు బంధువులు
సంఘటనా స్థలాన్ని సందర్శించిన ఎస్‌పి రవిప్రకాష్

ప్రజాశక్తి - తణుకురూరల్

తణుకు మండలం ముద్దాపురంలో ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని ముళ్లపూడి నాగహారిక(19) సజీవ దహనం ఘటన మిస్టరీగా మారింది. శుక్రవారం రాత్రి తన గదిలో నిద్రించిన నాగహారిక శనివారం తెల్లవారేసరికి నవ్వారు మంచంపై సజీవ దహనమైంది. యువతి తల్లి తరపు బంధువులు ఇది ముమ్మాటికీ హత్యే అని ఆరోపిస్తున్నారు. నాగహారిక తండ్రి ముళ్లపూడి శ్రీను భార్య గతంలో ఇదే తరహాలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఈ కేసులో శ్రీను నిందితునిగా ఉన్నాడు. అనంతరం రెండో వివాహం చేసుకున్నాడు. మొదటి భార్య కుమార్తె అయిన నాగహారిక తల్లి తరహాలోనే అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం పలు అనుమానాలకు




సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్‌పి

తావిస్తోంది. హాస్టల్‌లో ఉండే నాగహారిక కొంతకాలంగా ఇంటి నుంచే తాడేపల్లిగూడెం సమీపంలో ఉన్న ఇంజినీరింగ్ కళాశాలకు వెళ్లి వస్తుండటం, ప్రమాదం జరిగిన ఇల్లు కొత్త భవంతి కావడం యువతి సజీవ దహనమయ్యేంత ఇతర కారణాలు ఏమీ కానరావడం లేదని ఆ గ్రామస్తులు సైతం చర్చించుకుంటున్నారు. నాగహారిక తండ్రి శ్రీను రెండో భార్య ప్రమేయంతోనే హత్యా ఘటన చోటుచేసుకుని సజీవ దహనంగా చిత్రీకరిస్తున్నారని ప్రచారం సాగుతోంది. ఇప్పటికే సంఘటనా స్థలం నుంచి ఫోరెన్సిక్ సిబ్బంది, డాగ్‌స్క్వాడ్ వచ్చి ఆధారాలను సేకరించారు. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఇదిలా ఉండగా సంఘటనా స్థలాన్ని జిల్లా ఎస్‌పి రవిప్రకాష్ ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా దర్యాప్తునకు సంబంధించి పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు.

ఆక్వా పరిశ్రమల్లో తనిఖీలు..!
కాలుష్య నియంత్రణ మండలి అధికారుల రాకతో యాజమాన్యాల ఉలికిపాటు

ప్రజాశక్తి - భీమవరం



భీమవరం పరిసర ప్రాంతాల్లోని ఆక్వా పరిశ్రమల యాజమాన్యాలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాయి. రెండు రోజుల నుంచి భీమవరం, ఉండి నియోజకవర్గాల్లోని ఆక్వా పరిశ్రమల్లో కాలుష్య నియంత్రణ మండలి ఆకస్మిక తనిఖీలు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఆదివారం ఈ విషయం బహిర్గతం కావడంతో ఆక్వా పరిశ్రమల యాజమాన్యాలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాయి. కేంద్ర బృందం సభ్యులు ఈ తనిఖీలు నిర్వహిస్తుండటంతో స్థానిక అధికారులకు సమాచారం లేదని తెలిసింది. పరిశ్రమల్లో వ్యర్థ జలాలను స్థానికంగా ఉన్న పంట కాల్వల్లోకి విడిచి పెట్టడంతో సాగునీటి వనరులు కలుషితమౌతున్నాయంటూ కొంతకాలంగా ఈ ప్రాంతంలో ఆందోళనలు సాగుతున్న తెలిసిందే. ఈ నేపథ్యంలో కాలుష్య నియంత్రణ మండలి అధికారులు తనిఖీలు చేపట్టినట్లు సమాచారం. దీంతోపాటు ఆక్వా పరిశ్రమల్లో నిబంధనలు పాటించకపోవడంతో ప్రమాదాలు జరిగి కార్మికులు మృతి చెందుతుండటం కూడా ఈ తనిఖీలకు ఒక కారణమని చెబుతున్నారు. దీనిపై జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ఇఇ వెంకటేశ్వరరావును వివరణ కోరగా ఆక్వా పరిశ్రమల్లో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తమకు ఎటువంటి సమాచారం లేదని చెప్పారు.

సిపిఎస్ రద్దు కోరుతూ 15న సంతకాల సేకరణ

ప్రజాశక్తి - అత్తిలి

యుటిఎఫ్ మండల కమిటీ ఆధ్వర్యంలో సిపిఎస్ రద్దు కోసం ఇంటికే యుటిఎఫ్ కార్యక్రమం మూడు రోజులుగా నిర్వహిస్తున్నట్లు మండల ప్రధాన కార్యదర్శి అప్పలరాజు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ఉద్యోగ, ఉపాధ్యాయులకు సిపిఎస్, జిపిఎస్‌లపై అవగాహన కల్పిస్తూ భవిష్యత్ కార్యాచరణకు సిద్ధంగా ఉండాలని కోరుతున్నామన్నారు. ఈ నెల 15న సిపిఎస్ రద్దు కోరుతూ చేపట్టే సంతకాల సేకరణ కార్యక్రమంలో ఉద్యోగ, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షురాలు నాగశిరోమణి, అధ్యక్షుడు స్వామి, సిపిఎస్ మండల కన్వీనర్ రామారావు, జిల్లా కౌన్సిలర్ వెంకటరావు, కోశాధికారి దుర్గబాబు, మండల కార్యదర్శి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఒకరి రక్తదానం ముగ్గురికి ప్రాణదానం
తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షులు చెన్నంశెట్టి హరినాయుడు

ప్రజాశక్తి - ఉండి



రక్తదానం చేస్తున్న యువకులు

ఒకరి రక్తదానం ముగ్గురికి ప్రాణదానం చేసినట్లు అని తెలుగు యువత ఉండి నియోజకవర్గ అధ్యక్షులు చెన్నంశెట్టి హరినాయుడు అన్నారు. ఆదివారం ఎంఎల్ఎ మంతెన రామరాజు (కలవపూడి రాంబాబు) జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక కోట్ల ఫంక్షన్ హాలులో హోప్ సొసైటీ వారి సౌజన్యంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా తెలుగు యువత నియోజకవర్గ నాయకులు పసల వెంకటాచలం, రాష్ట్ర అధికార ప్రతినిధి రాంపల్లి వెంకట్, రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హరినాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో వంద మందికిపైగా రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. సేవా కార్యక్రమాలను తెలుగు యువత ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నేతలు కరిమెరక నాగరాజు, కట్ట రాంబాబు, గుండాబత్తుల నాగేశ్వరరావు, యశోద కృష్ణ, మంతెన సాయిలచ్చిరాజు, కిన్నెర వెంకన్న, దూసనపూడి రాంబాబు, ముదునూరి కృష్ణంరాజు, కాగిత మహంకాళి, కరిమెరక శ్రీనివాస్, పాలపర్తి బాలాజీ, బాబి తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

ఉచిత వైద్య శిబిరాలు పేదల పాలిట వరమని లయన్స్ క్లబ్ పూర్వ జిల్లా గవర్నర్ డాక్టర్ చినిమిల్లి సత్యనారాయణరావు అన్నారు. నరసాపురం లయన్స్ కమ్యూనిటీ హాలులో లయన్స్ క్లబ్, హెల్ప్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత గుండె వ్యాధుల పరీక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సమాజ శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని లయన్స్ క్లబ్ ప్రపంచ వ్యాప్తంగా చేస్తున్న సేవలు అందరికీ ఆదర్శనీయమన్నారు. నరసాపురం లయన్స్ క్లబ్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. పేద విద్యార్థులకు నోటు పుస్తకాలు అందించడంలో లయన్స్ క్లబ్ ముందుంటుందన్నారు. సుమారు 500 మంది రోగులకు డాక్టర్ కరీమ్, సాయి వైద్య సేవలందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అవసరమైన వారికి విజయవాడలోని హెల్ప్ ఆసుపత్రి ద్వారా ప్రభుత్వ సహాయంతో శస్త్ర చికిత్సలు చేస్తామన్నారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఎల్.రాజశేఖర్, కార్యదర్శి అల్లూరు బాబూరావు, కోశాధికారి రంగనీడి సుబ్బారావు అధ్యక్షత వహించారు. డిస్ట్రిక్ట్ పాస్ట్ గవర్నర్ మేక సురేష్ మాట్లాడారు. ఈ శిబిరంలో లయన్స్ క్లబ్ సభ్యులు పిఎస్ఎన్.మూర్తి, జోనల్ ఛైర్ పర్సన్ అల్లూరి నళిని, చినిమిల్లి శ్రీనివాస్, పిఎస్ఎన్.రాజు పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్ ప్రతినిధులకు పురస్కారాలు

ప్రజాశక్తి - పాలకొల్లు

భీమవరం ఆనంద ఫంక్షన్ హాలులో ఆదివారం నిర్వహించిన పూర్వ పశ్చిమగోదావరి జిల్లా స్థాయి వాకర్స్ సమావేశంలో పాలకొల్లు వాకర్స్ క్లబ్‌కు పలు పురస్కారాలు లభించాయి. బెస్ట్ క్లబ్, బెస్ట్ క్లబ్ ప్రెసిడెంట్‌తో పలు విశిష్ట సేవా పురస్కారాలు లభించాయి. ఆ క్లబ్ పాలకొల్లు అధ్యక్షులు తటవర్తి సుధాకర్, కార్యదర్శి షేక్ పీర్ సాహెబ్, కోశాధికారి పోతుల ఉమాశంకరరావు పురస్కారాలను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు ఆకి రామకృష్ణ, జివి.సుబ్బారావు, ముత్యాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి - ఉండి

బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉండి శాఖ గ్రంథాలయంలో నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కృష్ణమూర్తి తెలిపారు. మంగళవారం పుస్తక ప్రదర్శన, బుధవారం ధూమపానం మాదకద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహనా సదస్సు, గురువారం కవి సమ్మేళనం, శుక్రవారం బాలలకు చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వం వంటి పోటీలు, శనివారం దిశా చట్టం మహిళా సాధికారత వంటి అంశాలపై చర్చ, ఆదివారం డిజిటల్ గ్రంథాలయాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయాలని కృష్ణమూర్తి కోరారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలని పాదయాత్ర

ప్రజాశక్తి - ఆకివీడు

పేదలకు తాళ్ళకొండలో ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల స్థలాల్లో వెంటనే పూర్తిస్థాయి మౌలిక సదుపాయాలు కల్పించాలని జనసేన పార్టీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ నియోజకవర్గ నాయకులు జుత్తిగ నాగరాజు, గవర లక్ష్మి ఆధ్వర్యంలో ఆదివారం పాదయాత్ర నిర్వహించారు. స్థానిక గుమ్ములూరు సెంటర్ నుంచి తాళ్లకొండలోని 74 ఎకరాల్లో ఇళ్ల స్థలాల వరకు సుమారు 600 మందితో ఈ పాదయాత్ర సాగింది. కార్లు, మోటార్ సైకిల్, సైకిల్, నడకలతో ఈ యాత్ర సాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్లు, కరెంటు, మంచినీటి వంటి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ పాదయాత్రలో పార్టీ రాష్ట్ర నాయకులు తోట వాసు, కనకరాజు సూరి, జిల్లా నాయకులు కుటికలపూడి గోవిందరావు (చినబాబు), చినమిల్లి చంద్రశేఖర్, ఆకివీడు మండల అధ్యక్షులు కొటికలపూడి తాతాజీ, గవర అనిల్ పాల్గొన్నారు.

పోడూరు : జగనన్న ఇళ్లు.. పేదలకు కన్నీళ్లు కార్యక్రమాన్ని జనసేన మండల అధ్యక్షులు జి.రాజేష్ ఆధ్వర్యంలో మండలంలోని గుమ్ములూరు, పోడూరు, పండిత విల్లూరు గ్రామాల్లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సెక్రటరీ చిట్టూరి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం కేటాయించిన ఇళ్ల స్థలాల వద్ద కనీస మౌలిక సదుపాయాలు లేవన్నారు. రోడ్లు, డ్రెయినేజీ, వాటర్, కరెంటు వంటివి ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. దీంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. జనసేన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జాయింట్ సెక్రటరీ రావి హరిష్ మాట్లాడుతూ లబ్ధిదారులు అప్పులు తెచ్చుకుని బేస్‌మెంట్లు వేసుకున్నారన్నారు. లబ్ధిదారులకు ప్రభుత్వం అందించాల్సిన సిమెంట్, కంకర, ఐరన్, ఇసుక అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జి.రాంప్రసాద్, వైద రాజేష్, పితాని దుర్గాప్రసాద్, కోడి దుర్గాప్రసాద్, ఉన్నమట్ల లారెన్స్ పాల్గొన్నారు.

సోమేశ్వరం ఆదాయం రూ.2.79 లక్షలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

గునుపూడి భీమవరంలో ఉన్న సోమేశ్వర జనార్దన ఆలయం ఆదాయం రూ.2,79,420 సమకూరిందని కార్యనిర్వహణాధికారి తెలిపారు. కార్తీకమాసం మూడో ఆదివారం సందర్భంగా లడ్డు ప్రసాదం విక్రయించడం ద్వారా రూ.14,100, దర్శనం టిక్కెట్ల ద్వారా రూ.2,65,320 మొత్తం రూ.2,79,420 ఆదాయం వచ్చిందని తెలిపారు. భక్తులకు అసౌకర్యాలు కలగకుండా ధర్మకర్తల మండలి సభ్యులు కోడే విజయలక్ష్మి, ధర్మకర్తలు పర్యవేక్షించారని తెలిపారు.

ఐక్యతకు ప్రతీక.. వన సమారాధన

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

కార్తీక వన సమారాధనలు ఐకమత్యానికి ప్రతీకగా నిలుస్తాయని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి సిఎస్.సోమయాజులు అన్నారు. ఆదివారం నరసాపురం శ్రీలక్ష్మి కల్యాణ మండపంలో బ్రాహ్మణ సమైఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక వన సమారాధనలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రెడ్డప్ప దవేజీ, సంఘ పెద్దలు తేజోమూర్తుల నరసింహమూర్తి, డాక్టర్ డి.సాంబమూర్తి పాల్గొన్నారు.

పాలకొల్లు : పాలకొల్లు పెద్దసాయిబాబా ఆలయం రోడ్డు శెట్టిపల్లినాయుడు, శిడగం కిరణ్ లేఅవుట్‌లో ఆదివారం పాలకొల్లు పట్టణ తెలికుల సమైక్య సంఘం 56వ కార్తీక వనసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి అంగర రామమోహన్, మాజీ ఎంఎల్‌ఎ మేకా శేషుబాబు, కెల్లా పెద్దిరాజు, అధ్యక్షులు చిప్పాడ ఋషేంద్ర కుమార్ పాల్గొన్నారు.

పాలకొల్లు మారుతి సినిమా హాలు వద్ద కాపు, తెలగ, బలిజ కార్తీక వన సమారాధన ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్, ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు, ఎంఎల్‌సి అంగర రామమోహన్, మాజీ ఎంఎల్‌ఎ యల్లు వెంకట సత్యనారాయణ, మాజీ ఎంఎల్‌సి మేకా శేషుబాబు, చెల్లెం ఆనంద ప్రకాష్, గుణ్ణం నాగబాబు, యడ్ల తాతాజీ, చినిమిల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

పాలకొల్లు పట్టణ దేవాంగ సంక్షేమ సంఘం కార్తీక వన సమారాధన ఆదివారం హౌసింగ్ బోర్డులోని టిటిడి కల్యాణ మండపంలో నిర్వహించారు. ఆటలు, పోటీలతో పాటు అనేక రకమైన కార్యక్రమాలు ఆహ్లాదకరంగా సాగాయి. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు వట్టం గణేశ్వరరావు, ఉపాధ్యక్షులు మానెం బసవరాజు, కార్యదర్శి ఊటుకూరు భోగేశ్వరరావు, ట్రెజరర్ ద్వారా ప్రభాకరరావు, బసిన సత్యనారాయణ, శివగణేష్, కామిశెట్టి వెంకటలక్ష్మి, బొండపల్లి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పాలకొల్లు : స్థానిక క్షత్రియ సంక్షేమ పరిషత్ హాలులో పాలకొల్లు క్షత్రియ కార్తీక వన సమారాధన ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రైస్ మిల్లర్ సామంతపూడి సత్యనారాయణరాజును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్షత్రియ వీవ్ ఛైర్ మున్సిపల్ ప్రసాదరాజు, కార్పొరేషన్ ఛైర్మన్ పాతపాటి సర్రాజు, జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్, ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు పాల్గొన్నారు.

మొగల్తూరు : మొగల్తూరు మండలం శెట్టి బలిజ గౌడ సంఘాల కార్తీక వన సమారాధనలో మాజీ మంత్రి పితాని సత్యనారాయణ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర శెట్టిబలిజ సంఘం కార్పొరేషన్ ఛైర్మన్ గుబ్బల తమ్మయ్య, డిసిఎంఎస్ ఛైర్మన్ వి.వెంకటసుబ్బయ్య, మాజీ ఎంఎల్‌సి మేకా శేషుబాబు, జెడ్‌పిటిసి సభ్యులు కాండ్రేగుల నరసింహారావు, గుబ్బల రాధాకృష్ణ, పాకా సత్యనారాయణ, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు గుబ్బల నాగరాజు, గుబ్బల నారాయణమూర్తి, పాలా రాంబాబు, బాలం నాగమల్లేశ్వరరావు, తంగెళ్ల శ్రీనివాస్, కుక్కల కృష్ణమోహన్, పితాని శేఖర్, గుబ్బల చిన్న నాగరాజు, కడలి కిరణ్ పాల్గొన్నారు.

మొగల్తూరు పేరుపాలెం గ్రామంలోని గాయత్రి బ్రాహ్మణ సమైక్య ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక వనసమారాధన నిర్వహించారు. ఈ సమారాధనలో అధిక సంఖ్యలో సంఘీయులు పాల్గొని సహపంక్తి భోజనాలు చేశారు.

పాలకొల్లు నుంచే పోటీ : జెడ్‌పి ఛైర్మన్ కవురు

ప్రజాశక్తి - పాలకొల్లు

వచ్చే ఎన్నికల్లో తాను పాలకొల్లు నుంచి పోటీ చేస్తానని, సంఘ సభ్యులు పూర్తిగా మద్దతు తెలపాలని జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ చెప్పారు. పాలకొల్లు ఎంసిఎంలో ఆదివారం నిర్వహించిన శెట్టిబలిజ కార్తీక వన సమారాధనలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జగన్ ప్రభుత్వం బిసిలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. రాష్ట్రంలోని అన్ని ముఖ్య పదవులు 50 శాతం బిసిలకు ఇచ్చినట్లు చెప్పారు. నియోజకవర్గంలో ఏ సమస్య వచ్చినా తనను సంప్రదించాలని కోరారు. పాలకొల్లు పట్టణంలో నిర్మాణం ఆగిన శెట్టిబలిజ కమ్యూనిటీ హాలు నిర్మాణానికి జగన్ రూ.2.10 కోట్లు విడుదల చేశారని, వారం రోజుల్లో నిర్మాణ పనులు ప్రారంభవుతాయని తెలిపారు. కార్తీక సమారాధనలో కడిమెళ్ల సూర్యనారాయణ, గుదూరి హనుమంతరావు, కుక్కల శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైసిపి నాయకుల్లో అసంతృప్తి..!

సంస్థాగత నాయకుల వైఖరిపై విమర్శలు

పార్టీ కార్యక్రమాల సమాచారం అందించడంలేదని ఆవేదన

పార్టీలో చేరిన నాయకులపై విముఖత చూపుతున్నారని చర్చ

ప్రజాశక్తి - వీరవాసరం

అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడటంతో వీరవాసరం మండలంలో వైసిపి నాయకుల్లో నెలకొన్న అసంతృప్తి సెగలు బయటపడుతున్నాయి. గత మండల పరిషత్ ఎన్నికల్లో కొంత మంది వైసిపి నాయకుల అసంతృప్తి వల్లే ఓటమి పాలైనట్లు చర్చ జోరుగా జరిగింది. అప్పటి నుంచి అంతర్గతంగా ఉన్న ఈ సెగలు ప్రస్తుతం బాహాటంగా వెల్లడవుతున్నాయి. పార్టీ సంస్థాగత పదవులు రాలేదని కొంత మంది నాయకులు అసంతృప్తిగా ఉన్నారు. పార్టీ కార్యక్రమాల సమాచారం కూడా తమకు చెప్పడంలేదని కింది స్థాయి నాయకులు, కార్యకర్తలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సంస్థాగత నాయకుల వైఖరిని పార్టీ పెద్దలు గ్రహించకపోతే గత మండల పరిషత్ ఎన్నికల్లో వచ్చిన ఫలితాలే పునరావృతమవుతాయంటూ కింది స్థాయి నాయకులు పరోక్షంగా హెచ్చరిస్తున్నారు. ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను, ఆరోపణలను సైతం ధీటుగా తిప్పికొట్టలేని స్థితిలో వైసిపి సంస్థాగత మండల నాయకులు ఉన్నారని పలువురు చెప్పుకుంటున్నారు. టిడిపి నాయకుల పట్ల తీవ్రంగా స్పందించి, జనసేన నాయకుల పట్ల ప్రతి విమర్శలతో సరిపెట్టడం జనసేనతో ఉన్న తత్సంబంధాలే కారణమని వైసిపి కింది స్థాయి నాయకులు, కార్యకర్తలు విమర్శిస్తున్నారు. గత మండల పరిషత్ ఎన్నికల నుంచి జనసేన, వైసిపి నాయకుల మధ్య ఉన్న తత్సంబంధాల వల్లే ఈ పరిస్థితి అని చర్చించుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే వీరవాసరంలో జనసేన ఆధ్వర్యంలో సిఎం జగన్‌మోహన్‌రెడ్డి బొమ్మకు అంత్యక్రియలు నిర్వహించడం దేనికి సంకేతమనే భావన వైసిపి కింది స్థాయి నాయకుల్లో నెలకొంది. సిఎం జగన్ బొమ్మకు అంత్యక్రియల కార్యక్రమం చేపడుతుంటే కొంతమంది వైసిపి నాయకులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ దూరంగా ఉన్నారు. అక్కడే ఉన్న ఉన్న వైసిపి గ్రామ స్థాయి నాయకుడు ఆ కార్యక్రమాన్ని నిలువరించేందుకు పార్టీ పెద్దలకు, స్థానిక పోలీసులకు సమాచారం అందించేందుకు కూడా ప్రయత్నం చేయకపోవడంతో పలువురు వైసిపి నాయకులు ఆశ్చర్యపోయారు. రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ పట్ల మక్కువతో అనేక మంది మండల, గ్రామస్థాయి టిడిపి నాయకులు వైసిపిలో చేరారు. ఈ విధంగా వచ్చిన కొంతమంది నాయకులను అక్కున చేర్చుకోవడంలో స్థానిక వైసిపి సంస్థాగత నాయకులు విముఖత చూపడంతో వైసిపిలో కొనసాగాలా వద్దా అనే సందేహాలు వలస నాయకులు బాహాటంగా వ్యక్తం చేస్తున్నారు. వారికి వైసిపి నాయకులు పార్టీ కార్యక్రమాల సమాచారం ఇవ్వడంలో పూర్తిగా వివక్ష చూపుతున్నారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వాలకు భిన్నంగా వైసిపి సంక్షేమ పథకాలు అమలు చేస్తుంది కాబట్టి లబ్ధిదారులతో తమ పార్టీ గెలుపొందుతుందనే ఆలోచనా ధోరణిలో సంస్థాగత నాయకులు ఉంటే గత మండల పరిషత్ ఎన్నికల్లో వచ్చిన ఫలితాలే నియోజకవర్గ స్థాయిలో పునరావృతమవుతాయని కొంతమంది వైసిపి నాయకులు హెచ్చరిస్తున్నారు. వైసిపి సంస్థాగత నాయకుల తీరు పార్టీకి లాభం చేకూర్చుతుందా, నష్టం చేకూరుతుందా అనేది వేచి చూడాల్సిన పరిస్థితి మండలంలో నెలకొంది.

కొవ్వలి రామ్మోహన్‌నాయుడు సేవలు ఆదర్శం



మాట్లాడుతున్న రొటరీ క్లబ్ నరసాపురం అధ్యక్షులు ఘంటసాల బ్రహ్మాజీ

ప్రజాశక్తి - నరసాపురం

కొవ్వలి రామ్మోహన్‌నాయుడు సమాజానికి చేస్తున్న సేవలు ఆదర్శనీయమని రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ విశ్వనాథం భాస్కర్‌రామ్ అన్నారు. ఆదివారం నరసాపురం అల్లూరి సాంస్కృతిక కేంద్రంలో కొవ్వలి ఫౌండేషన్, చేతన్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో రోటరీ క్లబ్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఉచిత కృత్రిమ కాళ్ళ పంపిణీ శిబిరంలో భాస్కర్ రామ్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సమాజానికి కొవ్వలి ఫౌండేషన్, చేతన్ ఫౌండేషన్‌లు ద్వారా చేస్తున్న సేవలను కొనియాడారు. ప్రమాదవశాత్తు కాళ్ళు కోల్పోయిన వారికి ఈ ఉచిత కృత్రిమ కాళ్ళ పంపిణీ శిబిరం ఎంతగానో ఉపయగపడుతోందన్నారు. ఈ శిబిరంలో తమకు భాగస్వామ్యం కల్పించడం ఆనందదాయకమన్నారు. కొవ్వలి ఫౌండేషన్ నిర్వాహకురాలు జయలక్ష్మి మాట్లాడుతూ ఇటీవల కొవ్వలి, చేతన్ ఫౌండేషన్‌ల ఆధ్వర్యంలో ఉచిత కృత్రిమ కాళ్ళ ఎంపిక శిబిరాన్ని నిర్వహించామన్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 250 మందికి పరీక్షలు చేసి సుమారు వంద మందికి కృత్రిమ కాళ్ళ అవసరం కాగా, వారందరికీ ఈరోజు కొవ్వలి, చేతన్ ఫౌండేషన్‌ల ఆర్థిక సహకారంతో కృత్రిమ కాళ్ళు పంపిణీ చేశామని చెప్పారు. రోటరీ క్లబ్ అధ్యక్షులు ఘంటసాల బ్రహ్మాజీ మాట్లాడుతూ రోటరీ క్లబ్ సారథ్యంలో కొవ్వలి ఫౌండేషన్, చేతన్ ఫౌండేషన్ ఆర్థిక సహకారంతో పేదలకు కృత్రిమ కాళ్ళ పంపిణీ కార్యక్రమాన్ని విజయవతంగా నిర్వహించామన్నారు. కృత్రిమ కాళ్ల నిమిత్తం రూ.రెండు లక్షల వరకు కొవ్వలి రామ్మోహన్ నాయుడు ఆర్థిక సాయం చేయడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యదర్శి చిడే పార్ధ సారథి, కోశాధికారి చెన్నంసెట్టి నాగు, పూర్వ అధ్యక్షులు అందే వెంకటకృష్ణ, నూలి శ్రీనివాస్, టి.విజయ్‌కుమార్, తోట శ్రీనుబాబు, కోట్ల రామ్‌కుమార్, పాలంకి విశ్వనాధశాస్త్రి, తోట నాని, గన్నాబత్తుల సత్యవతి, అనసూయ, సంకు భాస్కర నాయుడు, భోగి రెడ్డి ముత్యం, నిమ్మకాయల బాబ్జీ పాల్గొన్నారు.

వైఎన్ కళాశాల డీన్ రామకృష్ణకు ట్రెండ్ సత్కారం

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

స్పందన ఈద ఇంటర్నేషనల్ ఫౌండేషన్ సేవా సంస్థ గుంటూరు వారి అధ్వర్యంలో సూరంపాలెం, ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో టీచర్ రిలేషన్‌షిప్ ఇన్ ఎడ్యుకేషన్ ఫర్ నేషనల్ డెవలప్‌మెంట్ (ట్రెండ్స్) కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నరసాపురం వైఎన్ కళాశాల డీన్ డాక్టర్ గంధం రామకృష్ణను గురు స్పందన పురస్కారం-2022 అవార్డుతో ఘనంగా సన్మానించారు. మానస హాస్పిటల్స్ ప్రముఖ వైద్యులు కర్రి రామరెడ్డి, ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి, డైరెక్టర్ డాక్టర్ ఎస్.సుగుణ, రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ ఎస్.రాజారావు, స్పందన ఈద ఇంటర్నేషనల్ ఫౌండేషన్ సేవా సంస్థ ఛైర్మన్-ఫౌండర్ డాక్టర్ ఈద శామ్యూల్ రెడ్డి, ఎస్ఇఐఎఫ్ ఎగ్జిక్యూటివ్స్ తోటకూర సాయిరామకృష్ణ, జి.రాజేశ్వరరావు, యర్రా కాశీ విశ్వనాథం, జానకిరామ్ చేతులమీదుగా అవార్డు అందుకున్నారు. సీతారామపురం, స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాల ఎంబిఎ విభాగం అధిపతి, ప్రొఫెసర్, డాక్టర్ ఎన్‌జిఎస్.ప్రసాద్‌ను, సిఇసి - హెచ్‌ఆర్ ఎస్.ఆనంద్‌ను పురస్కారంతో సన్మానించారు. గంధం రామకృష్ణను పలువురు అభినందించారు.

వైసిపిది జన రంజక పాలన

పార్టీ కాళ్ల మండల అధ్యక్షులు రాంబాబు



గణేశ్న రాంబాబు

ప్రజాశక్తి - కాళ్ల

జనరంజక పాలన సిఎం జగన్మోహన్‌రెడ్డితోనే సాధ్యమని వైసిపి కాళ్ల మండల అధ్యక్షులు గణేశ్న రాంబాబు అన్నారు. ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ మండల స్థాయిలో ప్రతి గ్రామంలో గ్రామ కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. మండల, గ్రామ కమిటీల్లో ఎస్‌సి, బిసి వర్గాలకు సమన్యాయం కల్పించామన్నారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించే ప్రతి గ్రామంలో విశేష స్పందన వస్తుందన్నారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తయిన గ్రామంలో రూ.20 లక్షలతో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. నెల రోజుల వ్యవధిలో ఆ పనులు పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతి గ్రామంలో జలజీవన్ మిషన్ నిధులతో పైపులైన్ విస్తరణ పనులు, సంపు ఫిల్టర్ బెడ్ నిర్మాణ పనులు వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహరాజు ఆదేశాలతో చేపడుతున్నామన్నారు. కోలనపల్లి, లక్ష్మీనరసింహాపురం గ్రామాల్లో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇచ్చిన హామీ మేరకు సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. సంక్షేమ పథకాలు పార్టీలకు అతీతంగా అన్న వర్గాల ప్రజలకు అందిస్తున్నామన్నారు. పార్టీకి మరింత ఆదరణ పెరిగిందన్నారు. టిడిపి, జనసేన పార్టీలకు చెందిన నాయకులు సర్పంచులుగా ఉన్న గ్రామాల్లో గ్రామ సచివాలయం, హెల్త్ క్లినిక్, రైతు భరోసా భవనాలను నిర్మించేందుకు ముందుకు రావడం లేదన్నారు. ఆ భవనాలను నిర్మించేందుకు వైసిపి నేతలను సమయాత్తం చేసుకుని భవనాలను నిర్మించేందుకు కృషి చేస్తూ అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నామన్నారు. ప్రజల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని సంక్షేమ పథకాలు అందిస్తూ గ్రామాలను మరింత అభివృద్ధి చేయాలనే నిబద్ధతతో, మూడు రాజధానుల నినాదంతో ఎన్నికలకు వెళ్తామని తెలిపారు. 2024 ఎన్నికల్లో సంక్షేమం అభివృద్ధి పనులు దిగ్విజయంగా నిర్వహించేందుకు సిఎం జగన్మోహన్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని, మరోసారి జగన్‌ని గెలిపిస్తే రాష్ట్ర మరింత అభివృద్ధి పథంలో పయనిస్తుందని తెలిపారు.

మావుళ్లమ్మ సేవలో డిఎస్‌పి శ్రీనాథ్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పట్టణంలో ఉన్న శ్రీ మావుళ్లమ్మవారిని ఆదివారం భీమవరం సబ్ డివిజన్ డిఎస్‌పి శ్రీనాథ్ దర్శించుకున్నారు. ఆయనను ఆలయ అధికారులు, ధర్మకర్తలు ఆలయ మర్యాదలతో సత్కరించారు. ఆయనతో పాటు వన్‌టౌన్ సిఐ శ్రీనివాస్ ఉన్నారు.

యాత్రికులతో ముత్యాలమ్మ ఆలయం కిటకిట

మొగల్తూరు : మండలంలోని ముత్యాలపల్లి గ్రామం లో ఉన్న బండి ముత్యాలమ్మ ఆలయం ఆదివారం యాత్రికులతో కిటకిటలాడింది. యాత్రికులు అమ్మ వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి కాను కలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి దెందుకూరి రామకృష్ణంరాజు ఛైర్మన్ కొల్లేటి రామారావు, ఆలయ సిబ్బంది, యాత్రికులకు అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేశారు.

చేలల్లో కలుపు.. ఆవేదనలో రైతులు

దాళ్వాకు సన్నద్ధమయ్యేందుకు ఆటంకాలు

మురుగునీటి కాలువలు ప్రక్షాళన చేయాలని వేడుకోలు




చేలో కలపు మందు పిచికారీ చేస్తున్న రైతు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

అధిక వర్షాలు, వరదలు ప్రకృతి వైపరీత్యాలతో సార్వాలో ఈ ఏడాది జిల్లాలో సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గింది. 2.46 లక్షల ఎకరాల్లో వరి నాట్లు వేయాల్సి ఉండగా కేవలం 1.95 లక్షల ఎకరాల్లో మాత్రమే నాట్లు పడ్డాయని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఇప్పటికే అప్పుల ఊబిలో కూరుకుపోయిన రైతులు గట్టెక్కుదామనుకున్న సమయంలో ఈ పరిస్థితి దాపురించడంతో రైతులు మరింత కుదేలయ్యారు. సార్వా సాగు ఎలాగూ లేదు.. ముందస్తు సాగుకు వెళదామనుకున్న రైతుకు కూడా వాతావరణ పరిస్థితులు అనుకూలించడం లేదు. నరసాపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో సార్వా సాగు సమయంలో కొందరు రైతులకు ప్రభుత్వం రాయితీపై విత్తనాలను సరఫరా చేసింది. అయితే అప్పట్లో నారుమడి వేసే పరిస్థితి లేకుండా వర్షాభావంతో ఆ విత్తనాలు రైతుల వద్దే ఉన్నాయి. ఈ నేపథ్యంలో నవంబర్‌లో నారుమడులు వేసేందుకు సిద్ధమైన రైతులకు మళ్లీ వరుసగా వర్షాలు కురవడంతో రైతులు అయోమయానికి గురయ్యారు. దీనికి తోడు పంట చేలల్లో ఎక్కువ రోజులు నీరు నిల్వ ఉండడంతో నీటి తామర, కిక్కేరస, నాచు, అంతర తామర, గుర్రపుడెక్క తదితర కలుపు మొక్కలు విపరీతంగా పెరిగిపోయాయి. దీంతో రైతులకు కలుపు నివారణ కత్తి మీద సాములా తయారైంది. మురుగునీటి కాలువలు లాగకపోవడంతో చేలల్లో ఇప్పటికే భారీగా నీరు నిల్వ ఉండిపోయిందని, చేలల్లో పెరిగిన తూడు నివారణకు, మురుగునీటి కాలువలు ప్రక్షాళనకు పూనుకొని దాళ్వా సాగుకు అవకాశం కల్పించాలని కోరుతూ పాలకొల్లు, నరసాపురం నియోజకవర్గాలకు చెందిన పలువురు రైతులు జిల్లా కలెక్టర్, సబ్ కలెక్టర్ కార్యాలయాల్లో వినతి చేసుకున్నారు. రైతు సంఘం నాయకులు ఇప్పటికే పలుమార్లు జిల్లా, మండల స్థాయి అధికారుల దృష్టికి స్పందన ద్వారా తీసుకెళ్లారు. చేలల్లో ఏపుగా పెరిగిన నీటి తామర, గుర్రపు డెక్క పలుమార్లు కలుపు మందులు పిచికారీ చేసినా, పూర్తిస్థాయిలో నివారణ కావడం లేదని రైతులు వాపోతున్నారు. కలుపు నివారణకు గ్లైపోసెట్ మందును ఒక ఎకరానికి లీటరు చొప్పున, పారాక్వట్ మందును ఒక ఎకరానికి లీటరు నుంచి లీటరున్నర వరకు పిచికారీ చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. పిచికారీ చేసిన అనంతరం కలుపు చనిపోతుందని, సుమారు పది రోజుల అనంతరం కలుపును దుక్కు ద్వారా భూమిలో కలియ దున్నడం ద్వారా కుళ్లిన కలుపు మొక్కలు సేంద్రియ పదార్థంగా పంటకు ఉపయోగపడుతుందని వారు సూచిస్తున్నారు.

మురుగునీటి కాలువల ప్రక్షాళన చేపట్టాలి

గుడాల కుబేరుడు, రైతు, సగం చెరువు



నేను గ్రామంలో తాడికోడు మురుగు కాలువకు ఆనుకుని ఉన్న మూడు ఎకరాలు సాగు చేసుకుంటున్నాను. దీనికి తోడు మరొక రెండు ఎకరాలు కౌలుకు చేస్తున్నాను. మురుగునీటి కాలువలు ప్రక్షాళన చేయకపోవడంతో చేలన్నీ చెరువులగా మారి తోడు పెరిగిపోయింది. ముంపు నీరు లాగితేనే కలుపు నివారణ, దాల్వా నారుమడుల పనులకు సన్నద్ధం అవ్వగలం. అధికారులు వెంటనే మురుగునీరు కాలువలు ప్రక్షాళన చేపట్టాలి.

కలుపు నివారణకు చర్యలు తీసుకోవాలి

శీలం సత్యనారాయణ, రైతు




మా తాత తండ్రుల నుంచి వ్యవసాయం చేస్తున్నాం. కానీ గతంలో ఎన్నడూ ఇటువంటి పరిస్థితులను ఎదుర్కోలేదు. ఎక్కడ చూసినా చేలన్నీ నీటితో మునిగి, గుర్రపు డెక్క, కిక్కెరసా, నీటి తామర వంటి కలుపు మొక్కలతో నిండిపోయింది. కలుపు నివారణ, చేలు దమ్ము చేయడానికి విపరీతంగా పెట్టుబడులు అయ్యే విధంగా పరిస్థితులు ఉన్నాయి. ఇప్పటికే మూడు మార్లు కలుపు మందు కొట్టినప్పటికీ ఇంకా ఒక రకమైన తూడు చిగురిస్తూ కనబడుతుంది. వ్యవసాయ శాఖ ద్వారా కలుపు నివారణకు తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

దాల్వాకు సన్నద్ధం కావాలి

జడ్డు వెంకటేశ్వరరావు, వ్యవసాయ శాఖ జెడి



దాల్వా సాగుకు సంబంధించి రైతులకు కిలో విత్తనాలు ఐదు రూపాయలు రాయితీపై ప్రభుత్వం అందిస్తుంది. దాల్వాకు 2.56 లక్షల ఎకరాల్లో వరి నాట్లు పడతాయి. భీమవరం, నరసాపురం, పాలకొల్లు ప్రాంతాల్లో సార్వాసాగు చేపట్టని భూముల్లో కలుపు నివారణ చర్యలు చేపట్టిన అనంతరం దాల్వాకు సన్నద్ధం కావాలి. రాయితీపై ఇస్తున్న విత్తనాలను రైతులు వినియోగించుకోవాలి.



మాట్లాడుతున్న ఎంఎల్ఎ ప్రసాదరాజు

రోటరీ క్లబ్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

రోటరీ క్లబ్ ద్వారా అందుతున్న సేవలు అభినందనీయమని నరసాపురం ఎంఎల్ఎ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. శ్రీ సూర్య కళాశాలల అధినేత ఘంటసాల బ్రహ్మాజీ, బిజిబిఎస్ కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ నూలి శ్రీనివాస్, ప్రముఖ వ్యాపారవేత్త కోట్ల రామ్‌కుమార్ ఆర్థిక సాయంతో రెండు ఫ్రీజర్స్, ఒక కైలాస రథాన్ని రోటరీ క్లబ్‌కు అందించారు. ఈ రథాన్ని ఎంఎల్ఎ ప్రసాదరాజు ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ద్వారా చేస్తున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు. ఈ కైలాస రథం ద్వారా రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత సేవలు అందుతాయని తెలిపారు.

దస్తావేజులు పోయినవి

నా క్లయింటున్నూ, ఏలూరు జిల్లా, నూజివీడు మండలం, దేవరగుంట గ్రామ కాపురస్తులు **తాళం మంగయ్య గారి కుమారుడు తాళం శ్రీనివాసరావు మరియు తాళం శ్రీనివాసరావు గారి భార్య తాళం విజయలక్ష్మి** నాకు యిచ్చిన సంజాయిషీ ప్రకారం యావన్మందికి తెలియజేయునది ఏమనగా,

నా క్లయింటుకు నూజివీడు మండలం, మొర్సపూడి గ్రామంలోని ఆర్.యస్. నెం. 266/3లో య. 0-38 సెంట్లు మెరక భూమి ది. 18-07-1990వ తేదీన **దాక్యుమెంటు నెం. 1415/1990** ద్వారా రిజిష్టర్ పొందియున్నారు. నా మొదటి క్లయింటు ది. 08-11-2022వ తేదీన ఉదయం సుమారు 10.00ల సమయంలో సదరు 1415/1990 నెంబరు గల దస్తావేజును తీసుకొని నూజివీడుకు వచ్చి జిరాక్సు తీసుకొని మరలా దేవరగుంట గ్రామమునకు వెళ్ళి చూడగా, సదరు ఒరిజినల్ డాక్యుమెంటు దారి మధ్యలో జారి పడిపోయినది. కావున పై తెలిపిన ఒరిజినల్ దస్తావేజు ఎవరికైనా దొరికిన యెడల నాకు గాని, నా క్లయింట్లుకు గాని అందచేయగలరు.

సయ్యద్ ఫరూక్, న్యాయవాది
నూజివీడు — నూజివీడు, ఏలూరు జిల్లా
ది.14-11-2022 — సెల్:9949448597

మహారాజశ్రీ 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి, ఏలూరు

ఒ.యస్. నెం. 21/2020

Between:
తేజశ్రీ బనియన్స్
రిప్రజెంట్ బై ప్రొప్రయిటర్
గుగ్గిలం సత్యవాణి **-వాది**
AND
జయశ్రీ రెమాండ్స్ అండ్ రెడీమేడ్
రిప్రజెంట్ బై ప్రొప్రయిటర్ పి.కళ్యాణి
-ప్రతివాది

వాది దాఖలు చేసిన పబ్లికేషన్

పై నెంబరు గల దావాలో ప్రతివాది అయిన జయశ్రీ రెమాండ్స్ అండ్ రెడీమేడ్, ప్రొప్రయిటర్: పి.కళ్యాణి, భర్త: రాంబాబు, నిర్మల హాస్పటల్ ఎదురుగా, జంగారెడ్డిగూడెం, ఏలూరు జిల్లా వారు పై నెంబరు గల దావాలో **ది. 15-11-2022వ తేదీన ఉదయం 10.30 ని॥లకు** స్వయంగా గాని, లేదా ప్లీడరు గారి ద్వారా గాని పై కోర్టు ముందు హాజరు అయ్యి తమ ఆక్షేపణలు తెలియపర్చుకొనవలెను. లేని యెడల సదరు దావా మీ పరోక్షమున తీర్మానం చేయబడును.

ఆవుల జగన్మోహనరావు
అడ్వకేట్
ఏలూరు — శ్రీరామ నివాస్, అశోక్‌నగర్
ది.12-11-2022 — ఏలూరు

In the Court of the First Additional Junior Civil Judge, Tanuku

E.A. No. 87/2019 in E.P. No. 82/2017 in O.S. No. 76/2007

Between:
Plaintiff/ D.Hr: Arava Seetha Devi
మరియు
Defendant/ J.Dr.:
Bejjavarapu Mutyala Satyanarayana

వాది తరపున వేయించిన ప్రకటన

శ్రీ కోర్టు వారి ఉత్తర్వులపై ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా పై నెంబరు గ్రంథంలో ప్రతివాది/ J.Dr. బెజ్జవరపు ముత్యాల సత్యనారాయణ, తండ్రి: రాములు, డోరు నెం. 10-19-17రు, 8వ వార్డు, బెజ్జవరపు వారి వీధి, పాతవూరు, తణుకు, పశ్చిమగోదావరి జిల్లా అయిన మీకు కోర్టు వారి ద్వారా మరియు రిజిష్టరు పోస్టు ద్వారా దావా సమన్లు పంపిననూ అమలుకాని కారణంగా ఇందుమూలముగా మీకు తెలియజేయునది ఏమనగా పై కోర్టు వారి ఎదుట **ది. 30-11-2022 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** స్వయంగా గాని, ప్లీడరు ద్వారాగా గాని హాజరై ఆక్షేపణలు తెలియజేసుకొన వలసినదిగాను, అట్లు కానిచో మీ పరోక్షమందు తీర్మానించబడునని తెలియజేయడమైనది.

KONDURI SATYA VENKATESWARLU
Advocate for Petitioner/ Plaintiff
Tanuku — Tanuku
Date: 10-11-2022 — Cell: 9133391921

In the Court of the Hon'ble Principal District Judge, Eluru

A.S. No. 89/2019

Between:
Sri Karri Satyanarayana ***...Appellant***
AND
Smt. Jakkamsetti Satyavathi and 4 Others ***...Respondents***

పై నంబరు అపీలులో 2వ రెస్పాండెంట్ అయిన ***R-2:*** Sri Jakkamsetti Venkata Harinadha Babu, S/o. late Hanumoji Rao, R/o. D.No. 1-45/1, Singanamuppavaram Village, H/o. Brahmanagudem Village, Nidadavole Mandal.
R-9: Sri Gajula Venkata Subba Rao, S/o. Kesava Rao, R/o. D.No. 1-2-593/34/404, Surya Kiran Apartments, Musharabad, Hyderabad, Telangana State.

అను వారికి నోటీసులు అమలు కొరకు ది. **16-11-2022 వాయిదా అయివున్నది. సదరు వాయిదా రోజు ఉదయం గం॥ 10 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయ్యి ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని ఎడల వారి పరోక్షమందు సంగతులు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

స్థలం: ఏలూరు — **ఇ.శ్రీనివాసబాబు**
ది.08-11-2022 — న్యాయవాది, ఏలూరు